## క్లుప్తంగా

### ఒకటి నుంచి సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు



ఆరిలోవ అంబేడ్కర్ కూడలిలో ప్రచారం చేస్తున్న సీపీఐ నాయకులు

**ఆరిలోవ:** సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలకు ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.కె.రెహమాన్ కోరారు. ఈ మేరకు పార్టీ ఆరిలోవ జోన్ నాయకులు గురువారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆరిలోవ అంబేడ్కర్ కూడలిలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని మురళీనగర్‌లో జూలై 1 నుంచి 3 వరకు సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. పార్టీ పరిస్థితి, ఏవిధంగా ప్రజల తరఫున పోరాడాలో చర్చించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎ.దేముడమ్మ, కె.లక్ష్మణరావు, సీహెచ్.కాసుబాబు, చిరంజీవి, పుష్పలత, రవి పాల్గొన్నారు.

### శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న అర్చకులు

**కొమ్మాది:** రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిను ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకెళ్లారు. అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

### ఘనంగా వెంకన్న ఆలయ వార్షికోత్సవం



భరత్‌నగర్‌లో వెంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి

**ఆరిలోవ:** జీవీఎంసీ 13వ వార్డు భరత్‌నగర్‌లో అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని పచ్చని పందిరి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా భరత్‌నగర్, టీబీసీ పాయింట్, ఎస్టీ కాలనీ, డ్రైవర్స్ కాలనీ, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ స్వామిని దర్శించుకున్నారు.

### ఆచార్య విజయమోహన్‌కు అభినందనలు

**ఎంవీపీ కాలనీ:** ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం డైరెక్టర్‌గా నియమితులైన ఏయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్‌కు పలువురు అభినందనలు తెలిపారు. పలువురు ఆచార్యులు, వర్సిటీ ఉన్నతాధికారులు, జాతీయ జర్నలిస్ట్ సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు శుక్రవారం ఆయన్ను కలిసి సత్కరించారు. ఎస్‌డీఈ డైరెక్టర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకోవాలని, వర్సిటీ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్.ఎల్.నరసింహారావు, ఏయూ క్రీడా విభాగాధిపతి ఆచార్య పల్లవి, తదితరులు పాల్గొన్నారు.



# ఎంవీపీ కాలనీలో ట్రా‘ఫికర్’

- రామలక్ష్మి అపార్ట్‌మెంట్ రోడ్డులో తరచూ ట్రాఫిక్ జామ్
- గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి రోడ్డులో నరకయాతన
- గిరిజన భవన్ కూడలిలో పనిచేయని సిగ్నల్స్



ఇటీవల అనధికారిక పార్కింగ్ కట్టడికి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు





ఎంవీపీ సర్కిల్ రోడ్డులో కల్వర్టపై వాహనాలు ఇలా..

**ఎంవీపీ కాలనీ:** ట్రాఫిక్ కష్టాలు ఎంవీపీ కాలనీలో రోజురోజుకూ పెరుగుతున్నాయి. నిత్యం పెరుగుతున్న వాహనాల రద్దీతో పాటు యథేచ్ఛగా అనధికారిక పార్కింగ్ కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఎంవీపీ డబుల్ రోడ్డు, ఎంవీపీ సర్కిల్ రోడ్లతో పాటు ఏఎస్ రాజా, ఉషోదయ, గిరిజన భవన్, రామలక్ష్మి అపార్ట్‌మెంట్ కూడళ్లలోను, గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి, రైతుబజార్ రహదారుల్లోనూ సాయంత్రం వేళల్లో పరిస్థితి మరి అధ్వానంగా తయారైంది. ఆయా ప్రాంతాల్లో విచ్చలవిడి పార్కింగ్‌తో పాటు ఫుట్‌పాత్‌లను ఆనుకుని నిర్వహిస్తున్న అనధికారిక వ్యాపార లావాదేవీలు కారణంగా ఈ పరిస్థితి



రామలక్ష్మి అపార్ట్‌మెంట్ కూడలిలో వాహనాల రద్దీ

తలెత్తుతోందని ఎంవీపీ కాలనీ వాసులు చెబుతున్నారు. ఇటీవల పరిస్థితిని చక్కదిద్దేందుకు ట్రాఫిక్ పోలీసులు ఎంవీపీలో అనధికారిక పార్కింగ్‌ల నివారణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి చర్యలు తీసుకున్నప్పటికీ తిరిగి పరిస్థితి షరామామూలే అన్నట్లు మారిపోయింది.

**క్యాన్సర్ ఆస్పత్రి రోడ్డులో..**

టీటీడీ కూడలి నుంచి ఎంవీపీ కాలనీలోని గాంధీ క్యాన్సర్ ఆస్పత్రికి వెళ్లే రోడ్డులో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రహదారిలో రెండు వైపులా షాపులు పెరిగిపోవడంతో పాటు రైతుబజార్‌కు వెళ్లే వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ప్రధానంగా సాయంత్రం పూట వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్యాన్సర్ ఆస్పత్రిని ఆనుకొని ఎంవీపీ సర్కిల్ రోడ్డులో ఉన్న కల్వర్టుపై అనధికారిక వ్యాపారాలు, అనధికారిక వాహనాల పార్కింగ్ కారణంగా ట్రాఫిక్ జామ్ అవుతోంది.

**పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్**

గిరిజన్ భవన్ కూడలిలో ట్రాఫిక్ కష్టాలను అరికట్టేందుకు పోలీసు యంత్రాంగం సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. అయితే కొద్ది రోజులుగా అక్కడ సిగ్నల్ లైట్స్ పనిచేయకపోవడంతో ట్రాఫిక్ కష్టాలు షరమామూలుగా మారాయి. దీంతో సాయంత్రం వేళల్లో ఇక్కడ ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తేవాలని వాహనదారులు కోరుతున్నారు. రామలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద నాలుగు రోడ్ల కూడలి కావడంతో ఏ వాహనదారులు రాంగ్‌రూట్‌లో వచ్చిన పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇప్పటికైనా ఆయా సమస్యల పరిష్కారానికి ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.





గిరిజన భవన్ సర్కిల్‌లో పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్

## రైతుబజార్‌లో హోల్‌సేల్ టమాటా విక్రయాలు



ఎంవీపీ రైతుబజార్ హోల్‌సేల్ షాపులో విక్రయిస్తున్న టమాటా

**ఆరిలోవ:** ఎంవీపీ రైతుబజార్‌లో హోల్‌సేల్ టమాటా అందుబాటులోకి వచ్చింది. కొద్ది రోజులగా టమాటా ధర ఆకాశాన్ని అంటిన విషయం తెలిసిందే. రైతుబజార్లలోనే కిలో రూ.68, రూ.70 చొప్పున విక్రయించారు. ఈ ధరను నియంత్రించాలనే ఆలోచనతో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు రైతుబజార్‌లో వినియోగదార్లకు హోల్‌సేల్ ధరకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం ఎంవీపీ రైతుబజార్‌కు సుమారు 3 టన్నుల టమాటా తీసుకొచ్చి హోల్‌సేల్ ధరకు అందుబాటులో ఉంచారు. వినియోగదారులకు కిలో రూ.46కి విక్రయించారు. దీంతో రైతుబజార్ షాపులలో వ్యాపారులు కూడా కిలో టమాటా అదే ధరకు విక్రయించాల్సి వచ్చింది. ధరలు నియంత్రణలో భాగంగా మార్కెటింగ్ శాఖ అధికారులు మదనపల్లి నుంచి టమాటా తీసుకువచ్చి రైతుబజార్‌కు సరఫరా చేసినట్లు ఎంవీపీ రైతుబజార్ ఈవో జి.ప్రసాద్ తెలిపారు. ఈ టమాటా ధర ఇంకా తగ్గే అవకాశం ఉన్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ సమయంలో టమాటా ధర పెరిగిన సమయంలో ఇలా ప్రత్యేక కౌంటర్లలో కిలో రూ.25కే విక్రయించేవారని పలువురు వినియోగదారులు చర్చించుకున్నారు.

## దేశ ఆర్థికాభివృద్ధిలో ఎంఎస్‌ఎంఈ సెక్టార్ పాత్ర కీలకం



సదస్సులో పాల్గొన్న నిపుణులతో ఏయూ అలుమ్ని చైర్మన్ శంకరరావు

**ఎంవీపీ కాలనీ:** దేశ ఆర్థికాభివృద్ధిలో ఎంఎస్ఎంఈ సెక్టార్ పాత్ర కీలకమని ఆర్థిక రంగ నిపుణుడు వసంతరావు సత్యవెంకటరావు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సంఘం కార్యాలయంలోని జీఎంఆర్ స్మార్ట్ సెమినార్ హాల్‌లో టైప్స్ ఆఫ్ ఫైనాన్సింగ్ ఫర్ ద ఎంఎస్ఎంఈ సెక్టార్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఏయూ అలుమ్ని, ఏయూ ఆ హాబ్, కలాం డ్రీమ్ ల్యాబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆర్థికరంగ నిపుణుడు వసంతరావు సత్యవెంకటరావు మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ రంగంలో ఆర్థిక తోడ్పాటుకు ఉన్న అవకాశాలను వివరించారు. పలు రకాల ఫైనాన్సింగ్ ఆప్షన్స్ ద్వారా చిన్న తరహా పరిశ్రమలు ఆర్థిక తోడ్పాటును అందిపుచ్చుకొని లాభాలు ఆర్జించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ ఈ.శంకరరావు, భారత ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అప్పికొండ, ఎంఎస్ఎంఈ రాష్ట్ర కమిటీ చైర్మన్ ఎస్.పాండురంగ ప్రసాద్, ఏపీ పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ గణపతి తదితరులు పాల్గొని ఎంఎస్ఎంఈ పరిశ్రమల అభివృద్ధికి ఉన్న అవకాశాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలు, సదుపాయాలను వివరించారు.

## జాబ్‌మేళాకు విశేష స్పందన





జాబ్‌మేళాలో మాట్లాడుతున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు

**మద్దిలపాలెం:** డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా యంత్రాంగం, జిల్లా ఉపాధి కార్యాలయం, కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. రెండు రోజుల పాటు జరిగే ఈ మేళాను ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ప్రారంభించారు. ఈ మేళాకు తొలిరోజు శుక్రవారం 1220 మంది అభ్యర్థులు హాజరయ్యారు. టెక్ మహీంద్ర, పాత్ర కంపెనీలో 328 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.1.67 లక్షలు నుంచి రూ.2.50 లక్షలు ప్యాకేజ్ ఉంటుంది. ఈ కార్యక్రమంలో టెక్ మహీంద్ర హెచ్‌ఆర్ గీతాంజలి, జేకేసీ కో–ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజా విక్రమదేవ్ వర్మ జయంతి



ఏయూలో రాజా విక్రమదేవ్ వర్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆయన బంధువులు

**ఆరిలోవ:** ఏయూలో శుక్రవారం రాజా విక్రమదేవ్ వర్మ 155వ జయంతి ఘనంగా జరిగింది. వర్సిటీలో ఉన్న రాజా విక్రమ దేవ్ వర్మ విగ్రహానికి ఆయన మనవరాలు జయపూర్ రాజమాత మయాంక కుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజా విక్రమదేవ్ వర్మ చేసిన సేవలను కొనియాడారు. విశాఖలో ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ఏర్పాటు చేయడానికి, ఒడిశాలో ఉత్కల్ వర్సిటీ ఏర్పాటుకు వందల ఎకరాల భూమిని విరాళంగా అందజేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం దండూబజార్ వద్ద ఎంవీడీఎం పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, జామెట్రీ బాక్సులు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపూర్ యువరాణి లతికాదేవి, రాజవంశీకులు వివేక్, లతికా డియో, చిట్లూరి గిరిధర్, రవి ప్రకాష్ బెయడ్, వెంకటరామన్, సురేంద్ర పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు కృషి చేయాలి



వెంకోజీపాలెం పాఠశాలలో ప్రవేశ ప్రక్రియలో పాల్గొన్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

**మద్దిలపాలెం :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జీవీఎంసీ 15వ వార్డు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జ్యోతి కోరారు. పాఠశాలలో శుక్రవారం ప్రవేశ ప్రక్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పేరెంట్స్ కమిటీల చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు విధిగా సమావేశాలకు హాజరై పాఠశాల అభివృద్ధికి సహకరించాలన్నారు. 1వ తరగతిలో ప్రవేశం పొందిన చిన్నారులతో ఆమె అక్షరాభ్యాసం చేయించారు.

## పీవీ నరసింహారావుకు ఘన నివాళి



పీవీ నరహింహారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

**బీచ్ రోడ్డు:** దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా విశాఖ బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రామ్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏయూ మాజీ రెక్టార్ ఆచార్య ప్రసన్నకుమార్, వుడా మాజీ చైర్మన్ పి.ఎస్.ఎన్.రాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవాత్సవ్, అసోసియేషన్ అధ్యక్షుడు కావూరి చరణ్‌కుమార్, కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ ట్రస్టీ సుబ్రహ్మణ్యం, 28వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే రామ్‌నగర్‌లోని పీవీ విగ్రహానికి మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో లంకా శ్రీనివాసు, దాడి లక్ష్మణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రక్తహీనతకు చెక్ పెడదాం



గంభీరం వెల్‌నెస్ సెంటర్‌లో రక్తహీన మాత్రలను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

**తగరపువలస:** ఎనీమియా ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం శుక్రవారం ఆనందపురం మండలంలో పర్యటించింది. బోయిపాలెం, చందక, గంభీరం పంచాయతీల్లో వైద్యశాఖ, ఐసీడీఎస్ శాఖల పనితీరును పరిశీలించిన తరువాత బోయిపాలెం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ రక్తహీనతను నివారించే మాత్రలు ప్రతి శుక్రవారం ఇస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. హిమోగ్లోబిన్ పరీక్షల రికార్డులను పరిశీలించారు. గంభీరం, చందకలలో ఉన్న హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లను పరిశీలించి గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికల్లో రక్తహీనతకు తీసుకుంటున్న చర్యలు తెలుసుకున్నారు. ఈ బృందంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ కేంద్ర కార్యాలయ అధికారి డాక్టర్ ఎస్.పూజిత, ఎనీమియా ముక్తి భారత్ జిల్లా ప్రోగ్రాం అధికారి సమత, డాక్టర్ హీనా దీక్షిత్, ఆనందపురం పీహెచ్‌సీ వైద్యాధికారి గంగునాయుడు, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్స్ అధికారి మనోరమ, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఐసీడీఎస్ భీమిలి పీవో మామిడి శ్రీదేవి, పర్యవేక్షకురాలు రత్నం, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



మల్లెపూలు, గులాబీల అలంకరణలో అమ్మవారు



క్షీరాభిషేక సేవలో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు

**అల్లిపురం :** బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో ఉభయదాతలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారిని మల్లెలతో అభిషేకించారు. ప్రతి శుక్రవారం జరిగే ఈ పూజలో పాల్గొనే వారు రూ.500 చెల్లించిన యెడల ఈ పూజకు దంపతులను లేక ఇద్దరిని అనుమతిస్తామని ఆలయ ఈవో తెలిపారు.

**నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన**

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

## వైభవోపేతం.. భువన విజయం



భువన విజయం సాహితీ రూపకాన్ని తిలకిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

**సీతంపేట:** శ్రీకృష్ణదేవ రాయలు కాలంలో అష్టదిగ్గజాలతో భువన విజయం సభ నిర్వహించేవారని పుస్తకాల్లో చదివాం, సినిమాలలో చూసి ఉంటాం. కానీ అప్పటి రాయల వారి వైభవం, ఆహార్యం, కవుల సాహితీ ప్రతిభ, చమత్కారం చూసే భాగ్యం మనకు లేదనే చెప్పాలి. శ్రీలలితాపీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాలలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన అక్కిరాజు సుందర రామకృష్ణంరాజు బృందం ప్రదర్శించిన ‘భువన విజయం సాహితీ రూపకం’ అప్పటి వైభవాన్ని ప్రేక్షకుల కళ్లకు కట్టినట్టు చూపారు. సభికులను శ్రీకృష్ణదేవరాయల కాలానికి తీసుకువెళ్లేలా రసాస్వాదనకు లోనుచేశారు.డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణరాజు ప్రధాన పాత్రలో శ్రీకృష్ణ దేవరాయలుగా అద్భుతమైన రాజసం, ఆహార్యంతో ఆకట్టుకున్నారు. అలాగే అప్పాజీగా ముదిగొండ శివప్రసాద్, అల్లసాని పెద్దనగా పంద్రప్రగడ శ్రీనివాస్, మల్లనగా భాస్కరభట్ల, అయ్యలరాజుగా కె.చంద్రశేఖరం, పింగళిసూరనగా చొడూరి నరసింహారావు, నంది తిమ్మనగా మల్లాది వెంకటగోపాలకృష్ణ, ధూర్జటిగా యెల్లం రాజు త్యాగరాజు, భట్టుమూర్తిగా సి.యం.కె.గాంధీ, తెనాలి రామకృష్ణుడిగా మావుడూరు సూర్యనారాయణమూర్తి తమదైన శైలిలో అద్భుత ఆహార్యం, పద్యపఠనంతో అలరించారు. ఈ సందర్భంగా అక్కిరాజు సుందర రామకృష్ణ మాట్లాడుతూ మతసామరాస్యన్ని చక్కగా పాటించి ప్రజా సంక్షేమం కోసం సుపరిపాలన అందించిన ఏకైక చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు అని కొనియాడారు. ఆ మహా చక్రవర్తి సాధించిన విజయాలను పక్కనపెడితే భాషాపరంగా ఆయన చేసిన కృషి ఆనాటి నుంచి ఈ నాటి వరకు ఏ రాజు, ఏ ప్రభుత్వం చెయ్యలేదనే చెప్పాలన్నారు. అష్ట దిగ్గజ పాత్రధారులు అద్భుత ప్రతిభతో దత్తపది, సమస్యపూరణ, వర్ణనలతో సభను రక్తికట్టించారు. కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన భువనవిజయం సాహితీ రూపకాన్ని పలువురు భక్తులు, సాహితీవేత్తలు చూసి తరించారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


## కేజీహెచ్‌కు చెడ్డ పేరు తెస్తే ఉపేక్షించేది లేదు

సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్



**మహారాణిపేట :** కేజీహెచ్‌లో కొంత మంది నర్సుల వల్ల ఆస్పత్రికి చెడ్డ పేరు వస్తోందని సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ అన్నారు. శుక్రవారం కేజీహెచ్‌లోని ఎథిక్స్ గ్యాలరీలో నర్సులను ఉద్దేశించి మాట్లాడారు. కొంత మంది నర్సులు ఆకాశరామన్న ఉత్తరాలు రాసి వ్యతిరేకంగా పని చేస్తున్నారన్నారు. ఇక్కడ 700 మంది నర్సులు పని చేస్తున్నారని.. అందరినీ ఏం అనలేమన్నారు. తనకు ఎవరి మీద వ్యతిరేకత లేదన్నారు. అయితే కేజీహెచ్‌కు చెడ్డ పేరు తీసుకొస్తే మాత్రం ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రేపటి నుంచి నర్సులు గాని, ఇతర స్టాఫ్ గాని ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. నియమ నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలన్నారు.

## రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

**తాటిచెట్లపాలెం:** విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. వివరాలిలా.. గురువారం రాత్రి విశాఖ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం 2లో గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు గవర్నమెంట్ రైల్వే పోలీసులకు సమాచారం తెలిసింది. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆదేశాలతో ఎస్ఐ వి.బాలాజీరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవని, వయసు సుమారు 50ఏ ఏళ్లు, ఎత్తు సుమారు 5.5 అడుగులు, చామనచాయ రంగులో ఉంటాడని, నీలం రంగు టీ షర్ట్, నలుపు రంగు నిక్కర్ ధరించి ఉన్నట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. మృతుడు ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వే స్టేషన్‌లోని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా గానీ లేదా 96661 22722, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని ఎస్ఐ బాలాజీరావు కోరారు.

## రెండు రైతుబజార్లలో పార్కింగ్ నిర్వహణ గడువు పెంపు

**మహారాణిపేట:** కంచరపాలెం, గోపాలపట్నం రైతు బజార్లలో ఖాళీ స్థలంలో పార్కింగ్ నిర్వహణ కోసం ఏడాది కాలానికి బహిరంగ వేలం నిర్వహణ ఇచ్చిన గడువును పెంచారు. జులై ఒకటో తేదీ నుంచి వచ్చే ఏడాది జూన్ 30వ తేదీ వరకు పార్కింగ్ నిర్వహణ కోసం ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ వేలం కోసం తొలుత ఈనెల 28వ తేదీ(శుక్రవారం) నిర్వహించాలని నిర్ణయించారు. వివిధ కారణాల వల్ల ఈ గడువును జులై 5వ తేదీ వరకు పొడిగించారు. ఈ బహిరంగ వేలంలో పాల్గొనే వారు రూ.10వేలు ధరావత్తు సొమ్మును జిల్లా జాయింట్ కలెక్టర్, రైతు బజార్లు, విశాఖపట్నం వారి పేరున డీడీని జత చేసి దరఖాస్తులను పంపాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను శనివారం నుంచి వచ్చేనెల 5వతేదీ మధ్యాహ్నం ఒంటి గంటలలోపు అందజేయాలని, 5న సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామని, బేస్ రేట్లు కూడా ఇవ్వడం జరిగిందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరించారు. పూర్తి చేసిన దరఖాస్తులు, ఇతర ఫారాలను జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి, డోర్.నంబరు 8.202/2, ఆర్ఆర్ వెంకటాపురం, గోపాలపట్నం, రైతుబజార్ పక్కన, విశాఖపట్నం–530029ను సంప్రదించాలి. లేదా ఫోన్ 9030819082కు సంప్రదించాలి.